క్లుప్తంగా

శాకంబరిగా కామాక్షి అమ్మవారు



విశిష్ట అలంకరణలో అమ్మవారు

సాలూరు: పట్టణంలో కామాక్షమ్మ అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలతో విశేషంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ వాసునాయుడు

సాలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ వాసునాయుడు అన్నారు. పట్టణంలోని సత్యసాయి జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన చట్టాలతో పాటు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసన్నవాణి

సాలూరు: విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి సూచించారు. పట్టణంలోని డబ్బివీధి హైస్కూల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.


సీఐటీయూ నాయకుల గృహ నిర్బంధం



గృహ నిర్బంధంలో ఎన్.వై.నాయుడు

సాలూరు: సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడును పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. దళితులపై దాడులు అరికట్టాలని, గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో తలపెట్టిన చలో కలెక్టరేట్ ధర్నాకు వెళ్లకుండా పలువురు సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 76 మంది ఎంపిక



ఇంటర్వ్యూలకు హాజరైన యువత

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ విజయవంతమైంది. 126 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా 76 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రేడియంట్ అప్లెయిన్స్, ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్, మైక్రో మ్యాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ డ్రైవ్‌లో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

అందుబాటులో ఎరువులు

బలిజిపేట:

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. బలిజిపేటలో ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాల వద్ద, ఎరువుల దుకాణాల వద్ద, కోఆపరేటివ్ సొసైటీ వద్ద ఖరీఫ్‌కు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. యూరియా 766.48 మెట్రిక్ టన్నులు, డీఏపీ 90.6 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 243.47, పొటాష్ 28.25, సూపర్‌ఫాస్ఫేట్ 28.25 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. స్టాక్ వివరాలు ప్రదర్శించాలని, ఎరువులు కొనుగోలు చేసిన వారికి రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని ప్రైవేట్ డీలర్లకు సూచించారు. రైతులకు ఎక్కడైనా ఎరువుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రైతులు ఆందోళన చెందొద్దు: ఏఓ

సాలూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలతో పాటు ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు పాస్ పుస్తకాలతో పాటు ఆధార్ కార్డును చూపించి ఎరువులు పొందవచ్చన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సీతానగరం: మండలంలోని ఎరువుల విక్రయ దుకాణాల్లో జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం అధికారి రవీంద్ర, ఏఓ ఎస్.అవినాష్ సోమవారం తనిఖీలు చేపట్టారు. గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలు, స్టాక్ రికార్డులను నిశితంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను దుకాణం ముందు ప్రదర్శించాలని డీలర్లకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ.. మండలంలో డీఏపీ ఎరువు కొరత నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఇంతవరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 212 మెట్రిక్ టన్నుల డీఏపీ, 326 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాల నుంచి 200 మెట్రిక్ టన్ను డీఏపీ, 585 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంగళవారం నాటికి 30 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతు సేవా కేంద్రాలకు రానుందని తెలిపారు. ఎరువులు కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వారి వెంట వ్యవసాయ సహాయకులు బి.సుధీర్, పి.లక్ష్మణరావు ఉన్నారు.

మక్కువ: ఖరీఫ్ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రస్తుతం మండలంలోని ఎరువుల దుకాణాల్లో 520 మెట్రిక్ టన్నుల యూరియా, 125 మెట్రిక్ టన్నుల డీఏపీ, 74 మెట్రిక్ టన్నుల పొటాస్, 154 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 127 మెట్రిక్ టన్నులు చొప్పున మొత్తం 1000 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే మండలంలో రైతు సేవ కేంద్రల్లో 70 మెట్రిక్ టన్నుల యూరియా, 56 మెట్రిక్ టన్నుల డీఏపీ, 12 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



బలిజిపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్



సీతానగరం: ఎరువుల గోదాంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వాలి

పార్వతీపురంటౌన్: ఏకలవ్య పాఠశాలల్లో ఐదేళ్లుగా పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఉద్యోగాలు కోల్పోయిన గిరిజనులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. గిరిజన సంస్థలో గిరిజనులకు కాకుండా ఇద్దరు గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇస్తూ గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమన్నారు. ఇదేనా కూటమి పాలన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులు మాట్లాడుతూ గిరినేతరులను విధుల్లోకి తీసుకున్నట్లే తమని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొండగొర్రి చిన్నారావు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు బొండపల్లి జనార్దన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పట్టపగలు విద్యుత్ వెలుగులు

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పగటపూట విద్యుత్ వీధిదీపాలు వెలుగుతున్నాయి. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ప్రజాధానాన్ని ఖర్చు చేస్తుంటే.. పంచాయతీ, విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథా అవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని కూర్మరాజుపేట, తోణాం, మామిడిపల్లి, కొట్టుపరువు, మావుడి, కందులపదం, తదితర పంచాయతీల్లోని గ్రామాల్లో సోమవారం వీధిదీపాలు వెలుగుతూ కనిపించాయి. ఈ విషయమై గ్రామస్తులను ప్రశ్నించగా.. వీధిదీపాలు నిత్యం వెలుగుతూనే ఉంటాయని, ఒక వేల లైట్లు పాడైతే రోజుల తరబడి కొత్త లైటు వేయడం లేదని వాపోయారు. అధికారులకు సమస్యను వివరించినా వారి నుంచి స్పందన లేదని అంటున్నారు.



కూర్మరాజుపేటలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు

వీధి కుక్కలను నియంత్రించాలని వినతి

పార్వతీపురం: వీధి కుక్కలను నియంత్రించాలని పార్వతీపురం మన్యం జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పెంటపాటి సూర్యారావు, రామకృష్ణలు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని, రోడ్డుపై ఒంటరిగా వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్.మధుసూదనరావు, శ్రీహరి, బీఎస్‌బీరావు, తదితరులున్నారు.



కలెక్టర్‌ను కలిసిన జిల్లా వినియోగదారుల సంఘ నాయకులు

ఏజెన్సీ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

మక్కువ: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సీఆర్‌పీఎఫ్-డి 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి.కష్టారావు, ఎస్‌ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మక్కువ, దుగ్గేరు రహదారిలో మూడు రోడ్ల కూడలి వద్ద, శ్రీదేవి కాలనీ జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏజెన్సీ గ్రామాల నుంచి మక్కువ వచ్చే ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల వివరాలు నమోద చేశారు.



మక్కువలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తాత్కాలిక వంతెన ఏర్పాటు

సాలూరు: మండలంలోని పెద్దపారన్నవలస గ్రామంలోని కూరగెడ్డపై నిర్మిస్తున్న మినీ వంతెన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఆ దిశగా రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు వంతెన ప్రాంతం దాటి అవతలి వైపు వెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వీటితో పాటు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గమనించిన సర్పంచ్ లక్ష్మణరావు తాత్కాలిక వంతెన ఏర్పాటుకు ముందుకు వచ్చి, తన పెద్దమనసును చాటుకున్నారు. సుమారు రూ.50 వేల వ్యయంతో ఐరన్ షీట్లు కొనుగోలు చేసి, ఆగిపోయిన వంతెన పిల్లర్ల నిర్మాణాల మీదుగా ఆ షీటును పరిచి, తాత్కాలికంగా వంతెన నిర్మించారు. ఈ నిర్మాణంలో గ్రామస్తులు, యువత సహకారం కూడా అందడంతో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయగలిగారు. ప్రస్తుతం నిర్మించిన తాత్కాలిక వంతెన మీదుగా నడిచివెళ్తున్న గ్రామస్తులు సర్పంచ్ సేవలను, గ్రామస్తుల సహకారాన్ని అభినందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, శాశ్వత వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.



కూరగెడ్డపై తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న వంతెన

శాంతియుత పోరాటంతోనే సమస్యల పరిష్కారం

సీతానగరం: పేదల సమస్యల పరిష్కారానికి శాంతియుత పోరాటం ఉత్తమమని సీఐటీయూ జిల్లా నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు అన్నారు. శివ్వాం గ్రామ దళితుల భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే దీక్షలకు సోమవారం సంఘీభావం తెలిపారు. దళితుల సమస్యపై పోరాటం చేస్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం అన్యాయమన్నారు. శివ్వాం భూముల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. కార్మిక సంఘాల నేతలను గృహ నిర్బంధం చేసే బదులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి లక్ష్మున్నాయుడు కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఆజూరు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పాచిపెంట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పాచిపెంట వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని గిరిశిఖర గ్రామమైన ఆజూరులో సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పశువులు, మేకల ఆవాసాలను ఇళ్లకు దూరంగా ఉంచాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చిన్నపాటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

వృథా మీటర్లను తొలగించండి



ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని చాలా పంచాయతీల్లో వీధిలైట్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లలో కొన్ని వృథాగా ఉన్నాయని, అటువంటి వాటిని తక్షణమే తొలగించాలని ఎంపీడీఓ ఎంబీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ మీటర్లు వృథాగా ఉన్నప్పటికీ కరెంటు బిల్లు మాత్రం రూ.లక్షల్లో వస్తోందని, విద్యుత్ వినియోగం లేకపోయినా అనవసరంగా పంచాయతీలపై భారం పడుతోందన్నారు. వెంటనే నిరుపయోగంగా ఉన్న మీటర్లను తొలగించాలని ఆదేశించారు.

ఉపాధి నిధులతో మినీ గోకులాల నిర్మాణం

గరుగుబిల్లి: మినీ గోకులాల నిర్మాణానికి రైతులు ముందుకురావాలని ఏపీఓ ఎం.గౌరీనాథ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతు వాటాగా 10 శాతం చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని ఉపాధిహామీ పథకం నిధుల నుంచి ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పశుసంవర్ధక కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

9న ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేడుకల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా వేడుకలు ఉండాలన్నారు. స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటలు ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. వేదిక వద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ ఎస్.సేదుమాధవన్, అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఆర్డీఓ కె.హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు

- 50 రోజులు పూర్తయినా అమలుకు నోచుకోని హామీలు
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు పూర్తయినప్పటికీ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తూ.. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా, మరో 3 నెలలు ఓటాన్ అక్కౌంట్‌కు వెళ్లిందని, 7 నెలలపాటు ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌కు వెళ్లడం బహుశా ఎప్పుడూ జరగలేదన్నారు. ఎన్నికల దగ్గరనుంచి చంద్రబాబు, అతని మీడియా రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబాబును భయం వెంటాడుతోంది

ఎన్నికల్లో తాను ఇచ్చిన మోసపూరిత హామీలను అమలు చేయని పరిస్థితుల్లో ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయం చంద్రబాబును వెంటాడుతోందన్నారు. అందుకే ప్రజలెవ్వరూ ప్రశ్నించకుండా ఈ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతోందని విమర్శించారు. రెడ్‌బుక్‌లో పేర్లున్న వారిపై చంద్రబాబు, లోకేష్ ఆదేశాల మేరకు టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

జగన్‌మోహన్‌రెడ్డి ఉండి ఉంటే..

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే సంక్షేమ పథకాలు కొనసాగేవని ప్రజలు అనుకుంటున్నారన్నారు. ఖరీఫ్ మొదలై చాలా రోజులు అయినా ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. ఉద్యోగం లేకపోతే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అన్నారు.

ప్రస్తుతం దాని ఊసెత్తడం లేదు. మత్స్యకార భరోసా కింద నెలకు రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇక ఇసుక విషయంలో కూడా చంద్రబాబు తీరు ఇలానే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక టీడీపీ ప్రభుత్వ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా, వాటిని 2,934కు తగ్గించాం. పర్మిట్ రూంలు రద్దు చేశాం. 43 వేల బెల్ట్ షాపులు రద్దు చేశాం. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు. ప్రైవేటు మద్యం దుకాణ విధానాన్ని రద్దు చేశామని గుర్తుచేశారు.

పాఠశాలల్లో అతిథి భోజనాలు



బలిజిపేట: పెదపెంకి హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ సింహాచలం



మక్కువ: మాట్లాడుతున్న హెచ్‌ఎం సత్యనారాయణ

బలిజిపేట: 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలల్లో శుభ తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు. పెదపెంకి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ-1 సామల సింహాచలం పాల్గొని విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఎంఈఓతో పాటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

మక్కువ: మండలంలో బంగారువలస ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు స్వీట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. వీటిని గ్రామస్తులు పాఠశాలకు అందించగా.. ఎంఈఓ పెంట సత్యనారాయణ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సత్యవతి, ఉపాధ్యాయిని సిదరపు అరుణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొమ్మి సత్యవతి, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

40 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి అనుమతి

బలిజిపేట: మండలంలో ఉపాధిహామీ నిధులతో సాగుచేస్తున్న పండ్ల తోటలను ఎంపీడీఓ రమేష్‌నాయుడు సోమవారం పరిశీలించారు. మండలంలోని 11 పంచాయతీల్లో 43 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రతిపాదనలు చేయగా 40 ఎకరాల్లో తోటల పెంపకానికి అనుమతులు వచ్చాయన్నారు. జీడి 13 ఎకరాలు, మామిడి 20 ఎకరాలు, సపోటా 3 ఎకరాలు, కొబ్బరి 7 ఎకరాల్లో సాగుకు అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. ఉపాధి వేతనదారులతో మొక్కలు నాటించాలని సిబ్బందికి సూచించారు. పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఏపీఓ కేశవరావు ఉన్నారు.



పణుకువలసలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

వెదురు కంజ సేకరణలో..

సాలూరు రూరల్: పూర్వకాలం నుంచి అటవీ ప్రాంతంలో నివశించే గిరిజనులు అడవిలో దొరికే వివిధ రకాల దుంపలు, పండ్లను ఆహారంగా తీసుకుని జీవిస్తున్నారు. కాలం మారినా వారి అలవాట్లు మాత్రం మారలేదు. కొఠియా గ్రామాల్లో గిరిజనులు శ్రావణ మాసంలో దొరికే వెదురు కంజను సేకరించి దాన్ని కూరగా వండుకుని ఇంటిల్లపాదీ తింటుంటారు. ఈ క్రమంలో దిగువశంబి గ్రామ సమీపంలో సోమవారం ఇద్దరు మహిళలు వెదురు కంజను సేకరించి ఇంటికి తీసుకువెళ్తూ కనిపించారు. అనేక పోషకవిలువలతో కూడిన వెదురు కంజ ఆరోగ్యానికి మంచిదని వారు తెలిపారు.



కొండల్లో సేకరించిన వెదురు కంజతో గిరిజన మహిళలు

నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏఎంవీఐ జి.నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పాలకొండ - సీతంపేట ప్రధాన రహదారిలో ఆర్టీసీ డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావుతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ట్రాఫిక్ రూల్స్ అధిగమించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఏమైనా ప్రమాదాలు జరిగితే యజమానులపై కేసులు నమోదు చేస్తారని చెప్పారు.



వాహన తనిఖీలు చేపడుతున్న ఏఎంవీఐ, ఆర్టీసీ డిపో మేనేజర్

దోమల నివారణ మందు పిచికారీ

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పీహెచ్‌సీ పరిధిలోని ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో దోమల నివారణ మందు పిచికారీ సోమవారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ జ్వరాల బారిన విద్యార్థులు పడకుండా ఈ చర్యలు చేపడుతున్నామని సూపర్‌వైజర్ శ్రీహరిరావు తెలిపారు.